క్లుప్తంగా

వాహనపత్రాలు తప్పనిసరి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

మక్కువ: మక్కువ – చినబోగిలి రహదారి వద్ద ఎస్‌ఐ వెంకటరమణ శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వాహనదారులుకు రహదారి నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహనదారునికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లుకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీల్లో ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచె ఏర్పాటు



ఎమ్మార్‌నగరంలో కంచెను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మండలంలోని ఎమ్మార్‌నగరం కొత్త వీధిలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేసే చర్యలు ఆ శాఖ అధికారులు చేపట్టారు. ఈ నెల 9న 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేసే చర్యలు చేపట్టారు. స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం టౌన్: రానున్న వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరులను కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి దృష్ట్యా ముందస్తు ప్రణాళికలు వేసి తాగునీటిని 24గంటలు అందించేలా చూడాలన్నారు. ప్రధాన రహదారిలో పందులు, పశువుల సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపించాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ పార్టీ నాయకులు వి.దాలినాయుడు, కె.కిరణ్, సాయిశ్రీనివాస్, తదితరులున్నారు.

ప్రారంభమైన శివాలయం ప్రతిష్ఠ పూజలు



కలశ పూజకు జలాన్ని తీసుకువెళ్తున్న మహిళలు

పార్వతీపురం రూరల్: మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభించారు. ఇందులో భాగంగా విశ్వక్షేణపూజ, పుణ్యాహవచనం, కలశపూజ, ధాన్యదివాసం, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలను చిలకలపల్లికి చెందిన శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 17న విగ్రహ ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బలగ నాగేశ్వరరావు తెలిపారు.

విపత్తులపై అవగాహన

సీతంపేట: మండలంలోని గోరపాడు, చిన్న బగ్గ గ్రామాల్లో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో విపత్తులు, వాతావరణ మార్పులపై శనివారం అవగాహన సదస్సులు నిర్వహించారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కలిగే నష్టాలు, తేనెమంచు, తదితర అంశాలపై వివరించారు. అలాగే జీడిపంట, కంది, జొన్న, కొర్రలు, ఊదలు, తదితర పంటల సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ వెన్నెల, మిన్నారావు, గోపాలరావు, పార్వతి, లావణ్య, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వాహన చోదకులూ.. జరభద్రం!



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ సంతోషి

- మైనర్లకు వాహనాలిస్తే జైలే..
- ఇతరులకు బండిస్తే అంతే సంగతులు

పార్వతీపురం రూరల్: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే రోజులకు ఇక కాలం చెల్లింది. ఇక నుంచి హెల్మెట్ లేకపోయినా, వాహన ధ్రువపత్రాలు చూపించకపోయినా రూ.వేలల్లో జరిమానాలు కట్టాల్సిందే. ఇదంతా కొత్త వాహన చట్టం చెబుతోంది. గతేడాది జూన్ నుంచే చట్టం అమల్లోకి వచ్చినా అది క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రూల్సు పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు చర్యలు షురూ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా చేపడుతున్న ఈ చర్యలకు అంతా సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

ఇతరులకు బండిస్తే అంతే సంగతులు

యాక్సిడెంట్ చేసిన వారితో పాటు వాహన యజమానిపైన, రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అమ్మిన వ్యక్తిపైనా కేసు నమోదు చేస్తారు. అప్పట్లో అయితే వెంటనే స్టేషన్ బెయిల్ మంజూరయ్యేది. నేరం రుజువైతే రెండేళ్ల వరకు జైలు శిక్ష ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. యాక్సిడెంట్‌కు కారణమైన వ్యక్తితో పాటు సంబంధిత వాహన యజమానికి వెంటనే బెయిల్ వచ్చే అవకాశం లేదు. అపరాధ రుసుంతో పాటు జైలు శిక్ష కూడా పడే అవకాశాలున్నాయని పోలీసులు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలే..

చాలామంది తల్లిదండ్రులు, బంధువులు తమ పిల్లలకు బైక్ ఇవ్వడాన్ని చాలా గొప్పగా భావిస్తారు. అయితే అది ఇకపై కుదరదు. సదరు మైనర్ బాలుడు లేదా బాలిక బైక్ నడిపి ప్రమాదానికి గురైతే వాహనం ఎవరి పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంటే వారిపై కేసు నమోదు చేస్తారు. గతంలో మైనర్లు వాహనాలు నడిపితే పెద్దగా జరిమానాలు ఏమి ఉండేవి కాదు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలకు మైనర్లు వాహనాలు నడపడం కూడా ఒక కారణం కావడంతో అధికారులు నిబంధనలు కఠినతరం చేసి శిక్షలు అమలు చేస్తున్నారు. కొత్త వాహన చట్టంలోని రూల్స్ ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే వారికి రూ.1000లు జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష కూడా వేసే అవకాశం ఉంది.

కొత్త చలానాలు ఇలా...

ఉల్లంఘన	అపరాధ రుసుం
ఇతరులకు వాహనం ఇస్తే	రూ.1000లు
పరిమితికి మించి ప్రయాణికులతో..	రూ.1000లు
సెల్‌ఫోన్‌తో మాట్లాడి వాహనం నడిపితే	రూ.1000లు
శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం	రూ.1000లు
అతివేగానికి	రూ.400లు
నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపితే..	రూ.1000లు
వాహన రిజిస్ట్రేషన్ లేకపోతే..	రూ.2000లు
ఫిట్‌నెస్ లేకుంటే..	రూ.2000లు
రాంగ్ పార్కింగ్	రూ.1000లు
హెల్మెట్ ధరించకపోతే..	రూ.100లు
వాహనానికి ఇన్సూరెన్స్ లేకపోతే	రూ.1000లు
మైనర్ డ్రైవింగ్	రూ.1000లు
మద్యం తాగి వాహనం నడిపితే..	రూ.10,000లు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



రహదారి ప్రమాదాలు నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తున్నాం. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలి. వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతీ ఒక్కరూ మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలి. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
– గోవిందరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం రూరల్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం



సీతానగరం: పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు



మక్కువ: చెత్త సంపద తయారీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ స్వరూపరాణి

సీతానగరం: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదభోగిల మేజరు పంచాయతీలో ఆయన ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాలు శనివారం చేపట్టారు. ప్రజలచే స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించారు. చెత్త సేకరణలో తడి, పొడి వేరు చేయాలని సూచించారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ త్రివిక్రమరావు, ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఏపీఎం ఆర్.శ్రీరామ్, హౌసింగ్ ఏఈ జానకీరాం, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, హరిత రాయబారులు, మహిళా సంఘాల సభ్యులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

సరాయివలసలో..

మక్కువ: మండలంలోని సరాయివలస గ్రామంలో ఎంపీడీఓ స్వరూపరాణి, ఈఓపీఆర్‌డీ పి.దేవకుమార్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. సరాయివలస గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ స్వరూపరాణి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించాలన్నారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం: సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ పద్మావతి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో..

సీతానగరం: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో సీఐ డి.పద్మావతి పర్యవేక్షణలో శనివారం అధికార సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు భవనంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతూ సీఐ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

గురుభక్తిని చాటుకున్న రాజన్నదొర



తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువును సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర. శ్రీకాకుళం కళాశాలలో తమకు ఇంగ్లిష్ బోధించిన అధ్యాపకుడు వెంకటేశ్వరరావు శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారని తెలుసుకున్న రాజన్నదొర నాటి తమ తోటి స్నేహితులతో కలిసి శ్రీకాకుళంలోని మాస్టారు ఇంటికి శనివారం వెళ్లారు. మాస్టారు యోగక్షేమాలన అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో కళాశాలలో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి స్నేహితులు కోటేశ్వరరావు, పుల్లయ్య, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు. – సాలూరు

సురక్షిత ప్రయాణమే లక్ష్యం కావాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పార్వతీపురం టౌన్: సురక్షిత ప్రయాణమే లక్ష్యం కావాలని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం వందశాతం సురక్షితం, శుభప్రదం అన్నారు. రవాణా శాఖ, పోలీసు శాఖ కలిసి ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్యం చేస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ఈ ఏడాదిలో గమనిస్తే హత్యలు, ఆత్మహత్యలు, విద్యుత్ షాక్‌లు వంటి మృతుల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే 80 మంది మృతి చెందారన్నారు. మరో 400 మందికి పైగా గాయాల పాలయ్యారన్నారు. ఈ సందర్భంగా సురక్షిత ప్రయాణం చేయడంలో ప్రధాన భూమిక పోషించిన ఆర్టీసీ డ్రైవర్లను దుశ్శాలువతో సత్కరించారు. ఆర్టీసీ డిపో మేనేజరు ఈఎస్‌కే దుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ శశికుమార్, పాలకొండ డిపో మేనేజర్ వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ఎస్‌ఐ రాజేష్

సీతానగరం: అందరి సహకారంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యపడుతుందని ఎస్‌ఐ ఎం.రాజేష్ అన్నారు. రాష్ట్ర రహదారిపై మండలంలోని జోగింపేట వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి వాహన చోదకులకు శనివారం అవగాహన కల్పించారు. వాహనచోదకులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

యాప్‌లతో ఆపసోపాలు



పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాజరు నమోదు చేసేందుకు ఉపాధ్యాయుల అవస్థలు

పార్వతీపురం రూరల్: అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఉపాధ్యాయులకు అగచాట్లు తప్పడం లేదు. ప్రభుత్వం కొత్తగా క్లస్టర్ విధానాన్ని అమలు చేసి శనివారం మధ్యాహ్నం వరకు పాఠశాలను నిర్వహించి మధ్యాహ్నం క్లస్టర్ సమావేశాలకు వెళ్లాలని ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు హాజరును మూడుసార్లు వేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఉదయం ఆయా పాఠశాలల్లో హాజరు వేశారు. మధ్యాహ్నం 1గంట తరువాత క్లస్టర్ సమావేశాల హాజరును యాప్‌లో నమోదు చేయాలని, సాయంత్రం 5.30 తరువాత వెళ్లే ముందు హాజరు వేయాలని సూచించారు. అయితే హాజరు యాప్‌లలో నమోదు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. ఉన్న యాప్‌లతోనే వేగలేకపోతుంటే ప్రభుత్వం కొత్తగా యాప్‌ల్లో కొత్త అంశాలను జోడించడంతో హాజరు నమోదు కావడం లేదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి అమరపు సూర్యనారాయణ పేర్కొన్నారు. అధికారుల తీరుపట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలంలోని పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తమ హాజరును నమోదు చేసేందుకు శనివారం కుస్తీలు పట్టారు.

'ఉపాధి' కోసం ఎదురు చూపు



పునికినవలస గ్రామం

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పునికినవలస గ్రామ గిరిజనులు ఇంతవరకు ఉపాధి పనులకు నోచుకోలేదు. మండలంలో పనులు ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు అధికారులు తమకు పని కల్పించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆ గ్రామ గిరిజనులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో జాబ్ కార్డులు ఉన్నప్పటికీ ఉపాధి పనులు సక్రమంగా కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో పనులు చేసిన కూలీలకు ఇంతవరకు కూలి డబ్బులు చెల్లించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఎన్నిసార్లు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి కూలి గురించి అడిగినా ప్రయోజనం లేకపోయిందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ కూలీల సంఖ్య 10వేలకు పెరగాలని ఆదేశాలు జారీ చేస్తుంటే అందుకు విరుద్ధంగా ఉపాధి అధికారులు వ్యవహరిస్తున్నారని చెప్పడానికి ఈ గ్రామంలో కూలీలే ఉదాహరణగా చెప్పొచ్చు. పని కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు.

జాబ్ కార్డు ఉంది పని లేదు



జాబ్ కార్డు ఉంది. ఉపాధి పని లేదు. పని కల్పిస్తే చేస్తాను. ఇంతవరకు ఎవ్వరూ ఉపాధి పనికి పిలవలేదు. పక్క గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్నారు. మా గ్రామంలో ఎప్పుడు పని కల్పిస్తారోనని ఎదురు చూస్తున్నాను.
– పండిక సాంబయ్య, పునికినవలస

చేసిన పనులకు డబ్బులివ్వలేదు..



గతంలో చేసిన పనికి ఇంతవరకు వేతనం చెల్లించలేదు. ఫీల్డు అసిస్టెంట్‌ని అడిగితే చూస్తాను.. అంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. నేను 7 టీములతో పనులు చేయించాను. మాలో నాతో పాటు చాలా మందికి కూలీ డబ్బులు జమ కాలేదు.
– జోగారావు, పునికినవలస

కలెక్టరేట్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి



కలెక్టరేట్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తదితరులు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: పార్వతీపురం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ నేతృత్వంలో శనివారం నిర్వహించారు. ప్రతి రోజూ వివిధ పనుల కోసం అధిక సంఖ్యలో ప్రజలు కలెక్టరేట్‌కు వస్తుంటారని, అటువంటి వారికి ఆహ్లాదకర వాతావరణం కనిపించాలని పేర్కొన్నారు. ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను శుభ్రం చేసి, అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన సంగతి విదితమే. అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మన ఇంటి పరిసరాలను ఎంత పరిశుభ్రంగా ఉంచుతామో అంతే పరిశుభ్రతతో కార్యాలయ పరిసరాలను ఉంచాలని, కలెక్టరేట్ ప్రాంగణమే కాకుండా, ప్రతి కార్యాలయ పరిసరాలను పరిశుభ్రతగా ఉంచాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పారిశుధ్య విధుల్లో విశేష సేవలు కనబరచిన పారిశుధ్య కార్మికుడు జె.చిరంజీవిని కలెక్టర్ ఈ సందర్భంగా దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోరారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమంపై జేసీకి కలెక్టర్ పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, మునిసిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కలెక్టర్ కార్యాలయంలోని వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పార్వతీపురం రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని, పరిసరాల పరిశుభ్రత నిర్వాహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సిబ్బందికి హెచ్చరించారు. పెదబొండపల్లి గ్రామంలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపట్ల కలెక్టర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఎందుకు తీసుకోలేదని డీఎల్‌డీఓ రమేష్ రామన్‌ను ప్రశ్నించారు. విధులపట్ల నిర్లక్షంగా వ్యవహరించిన సిబ్బందిపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దిబ్బగుడివలస గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను, ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఇంకుడు గుంతలు, గోకులాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. దిబ్బగుడివలస పర్యటనలో ఇంకుడు గుంతల వల్ల భూగర్భ జలాలు ఎలా పెరుగుతాయో కలెక్టర్ విద్యార్థులకు వివరించారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె.రామచంద్ర రావు, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, డీఎల్‌డీఓ రమేష్ రామన్, తహసీల్దార్ వై.జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.